ప్రాణాంతకం.. నీలినాలుక

గొర్రెల్లో నీలి నాలుక వ్యాధి(బ్లూటంగ్) విజృంభిస్తోంది. జిల్లాలో ఈ వ్యాధి లక్షణాలు ఉన్నట్లు పశుసంవర్థక శాఖ గుర్తించింది. దోమల కారణంగా సంభవించే ఈ ప్రాణాంతక వ్యాధి వర్షాకాలంలో సోకుతుంది. వైరస్‌లతో కలిగే వ్యాధిని మూతివాపు, పూతరోగం అని కూడా పిలుస్తారు. జిల్లాలో 4.38 లక్షల గొర్రెలున్నాయి. జీవాల పెంపకందారులు ఈ వ్యాధి విషయంలో అప్రమత్తంగా ఉండాలని, వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై పశు వైద్యాధికారుల సూచనలు, సలహాలు పాటించాల్సి ఉంది. –కార్వేటినగరం

- గొర్రెలకు దోమల ద్వారా వ్యాప్తి
- ముందస్తు గుర్తింపు, జాగ్రత్తలతోనే మేలు
- పశు వైద్యాధికారుల సూచనలు పాటించాలి


నీలినాలుక వ్యాధి సోకిన గొర్రెలకు టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారి

వ్యాధి వ్యాప్తి

నీలి నాలుక వ్యాధి కలుగజేసే వైరస్‌లు క్యూలికాయిడ్స్ అనే దోమకాటు ద్వారా జీవాల్లో ప్రవేశిస్తాయి. వర్షాకాలంలో ఈ వ్యాధి క్రిముల అభివృద్ధికి అవి విస్తరింపజేసే దోమల వ్యాప్తికి అనుకూలంగా ఉంటుంది. ఈ వ్యాధి సోకిన గొర్రెను దోమ కుట్టడం, అదే దోమ ఆరోగ్యవంతమైన గొర్రెను కుట్టడంతో ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. మందలో ఒక్కసారిగా ఈ వ్యాధి సంభవించి, మరణాలకు దారి తీస్తుంది. గొర్రెల కాపరులు వ్యాధిని గుర్తించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలి.

లక్షణాలు

- వ్యాధి సోకిన గొర్రెల్లో జ్వరం ఎక్కువగా(105–106 డిగ్రీల ఫారన్ హీట్ ఉష్ణోగ్రత) ఉంటుంది. శరీర ఉష్ణోగ్రత పెరిగి 3–8 రోజుల్లో వ్యాధి లక్షణాలు బయట పడుతాయి.
- వ్యాధి సోకిన 3వ రోజున గొర్రె నోరు, ముక్కల లోపల ఎర్రగా కంది క్రమంగా పెదాలు వాస్తాయి. నోటి నుంచి చొంగ కారుతుంది. క్రమంగా చొంగ చిక్కబడి ముక్కుల నుంచి నీరు కారుతుంది. పొక్కులు ఏర్పడుతాయి.
- ముఖం, పెదవులు, దవడల మధ్య వాపు వస్తుంది.
- నోటి లోపల నాలుక ఎర్రబడి, పైపొర లేచి పోయి పొక్కులుగా మారుతాయి.
- నాలుక నీలి రంగులోకి మారడంతో నీలినాలుక రోగం అంటారు.
- వ్యాధి సోకిన వారం తరువాత గిట్టల పైభాగాన ఎర్రటి నెత్తుగి చార కనిపించి, గొర్రెల జుట్టు ఊడుతుంది.
- ఆహారం తీసుకోకుండా క్షీణించి మరణాలు కూడా సంభవిస్తాయి.

నివారణ చర్యలు

- వ్యాధి తీవ్రతపై సూర్యరశ్మి ప్రభావం చూపుతుంది. కాబట్టి వ్యాధిగ్రస్త జీవాలను నీడలో ఉంచి చికిత్స చేయించాలి. మంద నుంచి దూరంగా ఉంచాలి
- దోమల నివారణకు వేపాకు, నీలగిరి, కలబంద లేదా పిడకల్ని కాల్చాలి. రాత్రి వేళల్లో ఎలక్ట్రిక్ బల్బులు పెడితే దోమల ఉధృతి తగ్గుతుంది
- గొర్రెల షెడ్లలో ఫ్యాన్లు, దోమతెరను వాడాలి

చికిత్స

- వ్యాధి లక్షణాలు గమినించిన వెంటనే పశువైద్యాధికారిని సంప్రదించాలి, యాంటీ బయాటిక్, నొప్పి నివారణ మందులు వాడడం ద్వారా గొర్రెలు చని పోకుండా కాపాడుకోవచ్చు.
- వ్యాధి సోకిన గొర్రెలను సకాలంలో గుర్తించాలి. నోటిపుండ్లను పొటాషియం పర్మాంగనేట్ లోషన్‌తో శుభ్రం చేసి వైద్యులు సూచించిన మందులు పూయాలి.
- గొర్రెలకు రాగిజావ లేదా మొక్కజొన్న జావను ఉప్పు కలిపి తాగించాలి.
- 5 రోజుల పాటు ఒక్కో గొర్రెకు డాక్టర్ సలహాతో యాంటీ బయాటిక్ ఇంజక్షన్లు వేయాలి. నీరసించిన గొర్రెలకు గ్లూకోజ్ ఎక్కించాలి.
- కాలిగిట్టల మీద పుండ్లను కడిగి హిమాక్స్ ఆయింట్‌మెంట్లను పూయాలి

వ్యాధి నివారణ చర్యలు

- గొర్రెల దొడ్లలో ఫినాయిల్, మలాథియాన్ వంటి క్రిమిసంహారక మందులను చల్లాలి
- ఎండిన వేపాకు పొగ, యూకలిప్టస్ పొగను సాయంత్రం పూట వేయాలి.
- డాక్టర్ సలహాలపై మందులు విధిగా వాడాలి.
- విటమిన్–సీ ఇంజక్షన్, పౌడర్‌ను వాడాలి, విట్–ఏ సిరప్‌ను వాడాలి.

క్లుప్తంగా

జోరుగా రహదారి పనులు


పట్టణ పరిధి ఏజేఎస్ కల్యాణ మండపం సమీపంలో జాతీయ రహదారి పనులు

నగరి: పుత్తూరు నుంచి తిరుత్తణి వరకు జాతీయ రహదారి వెడల్పులో భాగంగా జరుగుతున్న పనులు ఇప్పటి వరకు పట్టణ ప్రాంతానికి దూరంగా చేపట్టారు. అక్కడంతా భూసేకరణ చేపట్టి చదును చేసుకుంటూ రోడ్డు నిర్మిస్తూ వచ్చిన జాతీయ రహదారి అధికారులు ప్రస్తుతం పట్టణ పరిధిలో పనులను చేపట్టారు. రహదారిలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుండడంతో పలుమార్లు కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి గడ్కరీని కలిసి రెండేళ్ల క్రితం ఈ రోడ్డును మంజూరు చేయించిన విషయం అందరికీ విదితమే. జేసీబీలు, ప్రొక్లెయిన్ల సహకారంతో పనులు వేగంగా జరుగుతున్నాయి.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి గ్రీవెన్స్ నిర్వహిస్తామని.. ప్రజల ఫిర్యాదులు, వినతులు ఇక్కడ స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

ఐరాలలో..

ఐరాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ లోకేశ్వరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. మండల ప్రజలు తమ సమస్యలు అర్జీల రూపంలో సమర్పించి పరిష్కరించుకోవాలని ఆమె కోరారు. మండలస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.

ఘనంగా గంగమ్మ జాతర

వరదయ్యపాళెం: మండలంలోని తొండూరులో జరిగిన గంగమ్మ తల్లి గ్రామ జాతరలో సత్యవేడు నియోజకవర్గ వైఎస్‌ఆర్ సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్, పార్టీ శ్రేణులతో కలసి హాజరయ్యారు. ఆదివారం జరిగిన జాతరకు వచ్చిన ఆయనకు స్థానిక సర్పంచ్ రమణయ్య, వైఎస్‌ఆర్ సీపీ యువ నాయకుడు బాషా ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఆయన దర్శనం చేసుకోగా శాలువాలతో ఆయనను సత్కరించారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు నాయుడు దయాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బీరేంద్ర వర్మ, మాజీ సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి చిన్నా, వైస్ ఎంపీపీ శ్యామలమ్మ, పార్టీ సీనియర్ నాయకులు దామోదర్‌రెడ్డి, చిలమత్తూరు భాస్కర్‌రెడ్డి, పాల సుబ్రమణ్యంరెడ్డి, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షుడు బందిల సురేష్(బూత్ కమిటీ), వినోద్ యాదవ్ (యువజన), దేవళ్ల మహేంద్ర (బీసీ సెల్), శివా యాదవ్ (ప్రచార కమిటీ), రాష్ట్ర యూత్ కార్యదర్శి శిబి చక్రవర్తి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి, బీసీ సెల్ మండల కన్వీనర్ శేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి విశేష పూజలు

నింద్ర: మండలంలోని నింద్ర క్రాస్ రోడ్డు వద్ద ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమిళనాడు చెందిన చెన్నైలోని పెరంబూర్‌కు చెందిన భక్తులు తిరుమలకు కాలినడకన బయల్దేరారు. మార్గమధ్యలో ఉన్న నింద్ర క్రాస్ వద్ద శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు తిరుమలకు బయల్దేరారు.

ఓంశక్తి ఆలయంలో పూజలు

మండల కేంద్రమైన నింద్రలోని ఓం శక్తి ఆలయంలో ఆదివారం తమిళ మాసం ఆడి నెల పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద అంబళ్లు పోశారు. అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

వేడుకగా పీర్ల పండుగ



పాలసముద్రం: మండలం పరిధిలోని రాచపాల్యం మసీదులో ఆదివారం ముస్లింలు ఆదివారం పీర్ల పండుగ వేడకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ముస్లింలు తమ మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మసీదు నుండి గుండుబావి క్రాస్ రోడ్డు వరకు పీర్లను ఊరేగించారు. మండలంలోని ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి పీర్ల పండుగను వేడుకగా నిర్వహించారు.

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు

పాలసముద్రం: మండలంలోని క్రిష్ణజమ్మపురం కట్ట కింద వెలసిన కన్నికలమ్మకు, నరసింహపురం గ్రామంలో వెలసిన గ్రామ దేవతకు ఆదివారం ఆడి నెల పురష్కరించుకుని గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవార్లకు వివిధ అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. మధ్యాహ్నం అమ్మవారికి అంబలి పోసి, పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. నరసింహపురం గ్రామంలో వెలసిన గ్రామ దేవతకు గ్రామస్తులు అంబలి పోసే కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం మాజీ సర్పంచ్ ఆండాలు రవి ఉభయదారులు తీసుకొచ్చిన పూజసామగ్రితో అమ్మవారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజ, దీపారాధనలు సమర్పించారు. మహిళలు పిండి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.


కన్నికలమ్మ తల్లి


నరసింహపురంలో అంబలి తీసుకొస్తున్న భక్తులు

వైభవంగా అంకాళమ్మ ఉత్సవం

పుత్తూరు: మండల పరిధిలోని తొరూరు గ్రామంలో వెలసిన శ్రీఅంకాళమ్మ ఆలయ వార్షిక మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. 10 గంటలకు అంబలి ప్రసాదం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చిన మహిళలు అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకొన్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించడంతో పాటు భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు.

మునీశ్వర స్వామికి పూజలు


మునీశ్వరస్వామికి పూజాసామగ్రిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

తవణంపల్లె: మండల కేంద్రమైన తవణంపల్లెలో ఆదివారం మునీశ్వర స్వామికి భక్తిప్రపత్తులో పూజలు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు స్వామికి పూజాసామగ్రి, పొంగళ్లను ఊరేగింపుగా తీసుకొచ్చారు. స్వామికి పూజలు చేసి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. భక్తులు స్వామికి తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆడిమాసంలో ఏటా స్వామికి పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటున్నారు.

చదరంగంలో రాణిస్తే అనేక ప్రయోజనాలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రసాద్

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు చదరంగం క్రీడపై మక్కువ పెంచుకుని రాణించాలని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎస్‌ఆర్‌బీ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పలు ప్రాంతాలకు చెందిన 30 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ చదరంగం క్రీడ మేధో సంపత్తిని పెంపొందించే మనోహరమైన క్రీడా అని అన్నారు. ఈ క్రీడను క్రమం తప్పకుండా ఆడడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. సామాజిక సంబంధాలు మెరుగుపరుచుకోవడంలో చదరంగం ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఈ పోటీల్లో మొదటి బహుమతికై వసం చేసుకున్న ద్వారక అర్జున్, రెండవ బహుమతి పొందిన మౌనిష్, మూడవ బహుమతి పొందిన కుందనశ్రీ, నాలుగవ బహుమతి పొందిన లోహిత్ అక్షయ్ నాయక్‌కు బహుమతులు అందజేసి అభినందించారు. పోటీల్లో పలువురు చదరంగం అభిమానులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగిపై వేధింపులు తగదు

కార్వేటినగరం: సచివాలయ సిబ్బందిపై కక్ష సాధింపుతోనే కొందరు టీడీపీ నాయకులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని బాధిత కుటుంబ సభ్యులు ఆదివారం ఆరోపించారు. కార్వేటినగరం మండలం పొన్నగల్లు గ్రామానికి చెందిన వై.రాధాకృష్ణయ్య కుమారుడు వై.కేశవులు మండల పరిధిలోని సీడీ కండ్రిగ గ్రామంలోని సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అయితే పొన్నగల్లు గ్రామానికి చెందిన కొందరు టీడీపీ నాయకులు వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వంలో ఉద్యోగం సాధించాడని, అతను ఆ పార్టీకి సానుభూతిపరుడిగా ఉంటాడనే అనుమానంతో అతనికి భూములు లేక పోయినా సర్వే నంబర్ 163లో 1.60 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నాడని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన కలెక్టర్ పరిశీలించాలని సంబంధిత తహశీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు. అయితే ఎలాంటి ఆక్రమణలు జరగలేదని మండల రెవెన్యూ అధికారులు జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపారన్నారు. అయినప్పటికీ వారు తమ కుటుంబాన్ని వేధిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

ఆలయ ప్రాంగణంలో మొక్కల పెంపకం


శివాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న సేవాదళ్ సభ్యులు

నగరి: సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా శ్రీసత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు మధుసూదనం సూచన మేరకు ఆలయ ప్రాంగణాల్లో సత్యసాయి భక్తులు ప్రేమతరు మొక్కలను నాటారు. ఆదివారం నగరి ఓంశక్తి ఆలయ ప్రాంగణం, శివాలయ ప్రాంగణంలో తడుకుపేట సత్యసాయి భజన మండలి ప్రాంగణంలో రుద్రాక్ష, వేప, బాదం, వేప, కానుగ మొక్కలు నాటారు. ఆలయంలో ప్రదక్షిణలు చేసే భక్తులకు ఈ మొక్కలు ఆరోగ్యాన్ని ఇస్తాయని శ్రీసత్యసాయి భజన మండలి నగరి, తడుకుపేట కన్వీనర్లు లాయర్ మురళీధర్, వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 85 మంది ఎంపిక



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం రాముల గుడివీధిలోని జైన్ కార్యాలయంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తిరుపతి ఎస్వీ అరవింద్ ఆస్పత్రి వైద్యులచే కంటి పరీక్షలు చేశారు. ఈశిబిరానికి 170 మంది వచ్చారు. వారికి పరీక్షలు చేయగా ఆపరేషన్‌కు 85 మంది ఎంపికయ్యారు. ఎంపికైన వారికి ఉచితంగా ఆపరేషన్, వసతులు కల్పిస్తామని నిర్వాహకులు సుభాష్ జైన్ తెలిపారు. కార్యక్రమంలో ప్రేమ్‌చంద్, సాగర్, ప్రవీణ్, లలిత్, కమలేష్, అమిత్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి ఆరాధనోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో సొరకాయలస్వామి

నారాయణవనం: నారాయణవనంలోని సొరకాయలస్వామి జీవ సమాధి 123వ మహా గురుపూజ ఆరాధనోత్సవాలకు సోమవారం ఉదయం ధ్వజారోహణం నిర్వహించనున్నారు. పది రోజులపాటు నిర్వహించే ఉత్సవాలలో ప్రతి రోజు ఉదయం 9 గంటలకు ప్రత్యేక అభిషేకాలు, మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఉభయదారులతో అన్నదాన ప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ పేర్కొంది. ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం సహస్ర కలశాలను స్థాపించి ప్రత్యేక హోమాలు అనంతరం ఉభయదారులతో మూలవర్లకు కలశ జలాలతో అభిషేకం నిర్వహిస్తున్నట్లు కమిటీ తెలిపింది. సాయంత్రం పురవీధుల్లో సొరాకాయల స్వామి ఉత్సవర్ల ఊరేగింపు నిర్వహించనున్నారు. ఆగస్టు 7వ తేదీ గురువారం సాయంత్రం ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగుస్తాయని కమిటీ పేర్కొంది. మహా గురుపూజ ఆరాధనోత్సవాల సందర్భంగా ఆలయంతోపాటు నగరి వీధిని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

విరివిగా కూరగాయల సాగు

నిత్యావసరాల్లో ఒక్కటైన కూరగాయల సాగుపై అధిక శాతం రైతులు దృష్టి సారించారు. నియోజకవర్గంలో రైతులు దీనిపై ఎక్కువ ఆసక్తి కనబరుస్తుండగా నింద్ర మండలంలోనే 50 ఎకరాల మేర కూరగాయల పంట సాగులో ఉందని వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు. ప్రధానంగా వంగ, బెండ, బీర, కాకర, చిక్కుడు, పచ్చిమిర్చి తదితర కూరగాయలు సాగు విరివిగా చేస్తున్నారు. – నింద్ర


సాగులో ఉన్న వంగ తోట


కూరగాయ పంటలకు మందులు పిచికారీ చేస్తున్న రైతు

- మండలంలో వివిధ రకాల కూరగాయల సాగు
- ఆర్గానిక్ కూరగాయలవైపు ప్రజల ఆసక్తి
- ఆదాయం చూపుతున్న చెన్నై మార్కెట్

ప్రతి సంవత్సరం రబీ సీజన్‌లో అధికంగా కూరగాయలు పంటలు సాగు చేస్తున్నారు. వంగ, బెండకు అనుకూలంగా ఉన్నందున రబీ, ఖరీఫ్‌లో కూడా సాగు చేయడంతో రైతులకు మద్దతు ధర వస్తోంది. రైతు ఆశించిన ఆదాయం లభిస్తోంది. ముఖ్యంగా వంగ కేజీ రూ.40 పలకడం, బెండకాయలు కేజీ రూ.50 పలకడం కూరగాయల రైతుకు కలిసి వస్తోంది. దీంతో ఇదివరలో వేర్వేరు పంటలు సాగు చేసిన రైతులు కూడా ప్రస్తుతం కూరగాయల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు.

అకుకూరలకు పెరిగిన డిమాండ్

ఆకుకూరల పోషకాలపై ఇప్పటికే విరివిగా ప్రచారం జరగడంతో వాటి కోనుగోలుకు జనం ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. దీంతో మార్కెట్‌లో ఆకుకూరలకు డిమాండ్ పెరిగింది. కట్ట రూ.15 నుంచి రూ.20 పలుకుతోంది. ఈ కారణంగా రైతులు ఆకుకూరల సాగువైపు ఆసక్తి కనబరుస్తున్నారు. ఐదారు నెలల క్రితం కూరగాయలు సాగులో ఉన్న సమయంలో వర్షాలు పడడంతో నష్టాలపాలైన రైతులకు ప్రస్తుత సీజన్ కలిసి వస్తోంది. అతితక్కువ కాలంలో వచ్చే పంట కావడంతో అంతర పంటగా, మార్పు పంటగా ఆకుకూరలు, కూరగాయలు సాగు చేస్తున్నారు.

బెండ, వంగతో అధిక దిగుబడి

మండలంలోని ప్రతి గ్రామంలో రైతులు వంగ, బెండ తోటలు సాగు చేస్తున్నారు. తమిళనాడు రాష్ట్రం సరిహద్దును ఆనుకొని ఉండడంతో రాష్ట్రంలో గిట్టుబాటు ధర లేకున్నా ప్రతి రోజు తమిళనాడులోని చెన్నై మార్కెట్‌కు తరలించి, ఆశించిన ఆదాయం పొందుతున్నారు. కేజీ ధర రూ.40 ఉండడంతో ఒక్కో రైతు 200 కేజీలు మార్కెట్‌కు తరలించి ఆశించిన ఆదాయం పొందుతున్నారు. ఈ పంటలకు సస్యరక్షణ తప్పనిసరిగా చేయాలి. లేకుంటే చీడ పురుగుల అధికంగా చేరి పంటకు నష్టం కలిగిస్తుంది. రైతులు వారానికి ఒకసారి తప్పనిసరిగా తాము సూచించిన మందులను వాడాల్సి ఉంటుంది. ఇలా చేస్తే పంట నాణ్యతగా ఉండడంతో పాటు ఎక్కువ దిగుబడి లభిస్తుందని వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు.

సంతలకు కూరగాయలు

చిన్న, సన్నకారు రైతులు తాము సాగు చేసిన వివిధ రకాల కూరగాయ పంటలను వారపు సంతల్లో అమ్ముతున్నారు. కోసిన వెంటనే మార్కెట్ చేయడానికి వారికి స్థానికంగా నిర్వహించే సంతతోపాటు పరిసర ప్రాంతాల్లో నిర్వహించే వారపు సంతలు ఎంతో ఉపయోగపడుతోంది. దళారులతో సంబంధం లేకుండా రైతులే స్వయంగా సంతకు వెళ్లి అమ్మడం వారికి ఆదాయపరంగా కలిసి వస్తోంది. ఆర్గానిక్ పద్ధతిలో సాగు చేసే కొందరు రైతులు వారు పండించిన పంటలను ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆర్గానిక్ స్టోర్ ఏర్పాటు చేసి అమ్ముకుంటున్నారు.


మార్కెట్‌కు తరలుతున్న ఆర్గానిక్ కూరగాయలు



కలసివచ్చిన కూరగాయల సాగు



మాకు వివిధ పంటలు పండించడంతో పాటు కూరగాయల పంటల సాగు చేయడంతో ఎంతో అదాయం వస్తుంది. దిగుబడి కూడా బాగుంది. చెన్నై మార్కెట్‌కు కూరగాయలు తరలించడం మాకు కలిసివస్తోంది. అందుకోసం కూరగాయలు సాగు చేయడంపై ఆసక్తి చూపుతున్నాం.
–కార్తీక్, రైతు, మిట్టకండ్రిగ, నింద్ర మండలం

కూరగాయల సాగుతో లాభాలు



కూరగాయల పంటలు సాగు చేయడంతో మాకు ఎలాంటి నష్టాలు లేవు. కూరగాయలకు ప్రస్తుతం ఎక్కువగా డిమాండ్ ఉంది. దీంతో దిగుబడి తగ్గినా నష్టాలు పెద్దగా ఉండవు. చెన్నై కూరగాయల మార్కెట్‌కు తరలిస్తే మంచి లాభాలు వస్తాయి. తరలించలేని పక్షంలో వారపు సంతల్లో విక్రయిస్తాం. సాధారణంగా పండించే పంటలకన్నా ఆర్గానిక్ పద్ధతిలో పండించే పంటకు ఎక్కువ డిమాండ్ ఉంది.
–రమేష్,రైతు, అత్తూరు, నింద్ర మండలం